# స్వయంవరం

సుబ్బారావు ఇంట్లో అడుగు పెట్టా డప్పుడే. వంటింట్లో సామాన్లు సర్దుతున్న కాంతమ్మ సుబ్బారావును చూసి, గబ గబా వచ్చి -

'ఏమండీ! వెళ్ళినపని ఏమయింది? కాయా? పండా?' అని ఆత్రుతగా అడిగింది కాంతమ్మ.

సుబ్బారావు చిరాగ్గా 'నే చెబితే విన్నావా? వాళ్ళకి సంబంధం అక్కర్లేదట' అన్నాడు. కాసేపాగి సుబ్బారావే అన్నాడు 'మా చెల్లెలు కొడుకు రామానికి, మన కాంతను చేసుకోమంటాను. ఏమంటావ్? ఆస్తి లేకపోతేనేం? నిక్షేపంలాంటి సంబంధం. కుర్రాడు బి. యే. చదువుతున్నాడు. అందగాడు' నీ అభిప్రాయం ఏమిటన్నట్లు కాంతం వైపు సాలోచనగా చూశాడు సుబ్బారావు.

సుబ్బారావు మాటలు విన్న కాంతమ్మ మూతి మూడు వంకర్లు తిప్పి 'మీ చెల్లెలూ సరే, నేనూ సరే. చదివాట్ట అబ్బాయి సతుకు. మా అన్నయ్య కొడుకు వెంకట్రావుకిస్తే పోలా? వాడు చదువుకోకపోతేనేం? బోలెడంత ఆస్తి. కాలు మీద కాలేసుకుని తిన్నా తరగదు. ఒక్కడే కొడుకాయె? కాపోతే కాస్త కట్నం ఎక్కువ అడుగుతారు. మనకి మాత్రం కాంత ఒక్కతేగా? వాళ్ళడిగిన దక్షిణ ఇస్తే సరి' అని ఓ లెక్చరు దంచింది.

సుబ్బారావు 'ఏమైనా సరే మీ అన్నయ్యకొడుక్కి కాంతనివ్వను.' నొక్కి చెప్పాడు. 'ఎందుకివ్వరో, ఎట్లాయివ్వరో చూస్తా!' సవాల్ చేసింది కాంతమ్మ. వాళ్ళకిట్లా భేదాభిప్రాయం రావటం ఇవ్వాళ కొత్తేమీ కాదు. కాంత పెద్దదైన నప్పటినుంచీ కాంతమ్మ వాళ్ళన్నయ్య కొడుక్కివ్వాలని, సుబ్బారావు వాళ్ళ చెల్లెలు కొడుక్కివ్వాలని పట్టుదలలు పోతున్నారు.

ఇది జరిగిన తరువాత కాంతమ్మ ఏదో ఒకటి తేల్చుకోవాలని నిశ్చయించుకొంది. పక్కింటి వాళ్లబ్బాయి రాముచేత వాళ్ళన్నయ్యకు ఓ పుత్తరం వ్రాయించింది- వెంకట్రావును చూడాలని వున్నది. కనుక ఇక్కడికి పంపిస్తే కొద్ది రోజులుండి వెళతాడు - అని. అసలు కాంతమ్మ ఎత్తువేరు. వెంకట్రావు నిక్కడికి రప్పించి, కాంత వెంకట్రావు ఒకరి నొకరు ప్రేమించుకునేట్టు చేస్తే సుబ్బారావింకేంచేయ గలడు? తనమాట నెగ్గితీరుతుంది.

సుబ్బారావు మాత్రం తక్కువ తిన్నాడా? భార్యకి తెలీకుండా, రామాన్ని సెలవుల కొకసారి రమ్మని కార్డు వ్రాశాడు.

---

*మొదటి బహుమతి రూ. 50*

ఆర్. పి. వర్ధని
(బి. ఏ. రెండవ సంవత్సరం, గవర్నమెంట్ కాలేజీ ఫర్ విమెన్, గుంటూరు)

అనుకున్న ప్రకారం రామం, వెంకట్రావు ఒకటి రెండు రోజుల తేడాలో సుబ్బారావింటికి వచ్చారు. కాంతమ్మ శాంతను వెంకట్రావు దగ్గరికి కాఫీ టిఫిన్ యిచ్చి రమ్మని పంపించేది. ఇంతలో సుబ్బారావు కూతుర్ని పిలిచి బాకీ నీళ్ళు తోడమని, తుడుచుకోవటానికి టవల్ ఇవ్వమని పురమాయించేవాడు. శాంతపని ఇరకాటంగా వుండేది. ఎవరికివ్వాలో, ఎవరికివ్వకూడదో నిశ్చయించుకోలేక 'నాకిద్దరు బావ లుండటం ఎంత ప్రమాదం వచ్చింది. నన్ను గండం నుంచి తప్పించమని భగవంతుణ్ణి రోజూ ప్రార్థించేది. రామానికేదన్నా అందిస్తే కాంతమ్మకు కోపం, వెంకట్రావుకేదన్నా అందిస్తే సుబ్బారావుకు కోపం. అమ్మా నాన్నల మధ్య నలిగిపోయిందా అమ్మాయి.

ఏదేమైనా రామం, వెంకట్రావుల పని హాయిగా వుంది. అంతేగాక వాళ్ళిద్దరూ అతి సన్నిహితులుగా తయారయ్యారు.

వారం రోజుల్లో విసిగెత్తిన రామం, వెంకట్రావులు ఒకేసారి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకొన్నారు. కాంతమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకొని శాంతనెట్లాగైనా చేసుకోమని, వెళ్ళగానే ఏ సంగతి వ్రాయవలసిందిగా మరీ మరీ చెప్పింది.

సుబ్బారావు తిప్పలుపడి డబ్బెట్లాగో ఒక చోట అప్పు తీసుకొని బట్టలు పెట్టాడిద్దరికీ. రామానికి పెట్టి వెంకట్రావుకు పెట్టకపోతే బావుండదు కనుక విధిలేక పెట్టాడన్న మాట. సుబ్బారావు రామం రేపు వెడతాడనగా బజారంతా తిప్పి శాంతను పెళ్ళిచేసుకోమని, అందువలన తమ బాంధవ్యం గట్టిపడటమే కాక తన్ను గట్టెక్కించిన వాడవుతాడు గనుక శాంతనే నిశ్చయించుకోమని హితబోధ చేసి పంపించాడు.

భార్యాభర్తలిద్దరూ ఉత్తరాల కోసం ఎదురు చూడసాగారు. వారం రోజులయినా ఎవరి దగ్గర నుంచి వుత్తరం రాలేదు. ఆరోజు సుబ్బారావు వంట్లో బాగుండక ఆఫీసుకి సెలవు పెట్టాడు. ఇంతలో 'పోస్టుమాన్ వచ్చి రెండు కవర్లిచ్చి పోయాడు. ఇంట్లో వున్న కాంతమ్మ కూడా భర్తదగ్గరకొచ్చింది ఆత్రంగా. ఒక కవరు చింపి సుబ్బారావు సంతోషంగా కాంతమ్మ వైపు చూశాడు. అది వెంకట్రావు పెళ్ళిశుభలేఖ. ఎవరో పెద్ద వ్యాపారస్థుడి కూతురితో నిశ్చయించారు. కనుక పెళ్ళికి పదిరోజులు ముందుగా రమ్మని ఒక వుత్తరం. రెండో కవరు చింపాడు సుబ్బారావు "చి॥ రామంని, చి॥సౌ॥ సరోజకిచ్చి చేయ నిశ్చయించారు గాన,....' తెల్లబోవటం సుబ్బారావంతు అయిందీ మాటు.

□□□